సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 7 । మార్చి । 2025



రాములోరికి 'గోటి తలంబ్రాలు'

వరంగల్ బ్యాంక్‌కాలనీలోని మహిళలు భక్తి శ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ వరిగింజలను గోటితో ఒలిచి తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. - 8లో ▸



ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా

వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా వేశారు. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35^0 / 19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.



న్యూస్‌రీల్

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

హన్మకొండ: అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏసీ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్ నుంచి రాజధాని ఏసీ బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 13న ఉదయం 6 గంటలకు కాణిపాకం చేరుకుంటుందని, విఘ్నేశ్వరుడి దర్శనానంతరం బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. దర్శనానంతరం బయల్దేరి రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. ఈనెల 14న మధ్యాహ్నం అరుణాచలంలో బయల్దేరి 15న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠానికి చేరుకుంటుందని.. అనంతరం ఇక్కడి నుంచి బయల్దేరి హనుమకొండకు చేరుకుంటుందని పేర్కొన్నారు. చార్జీ పెద్దలకు రూ.6 వేలు, పిల్లలకు రూ.4500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈటూర్ ప్యాకేజీకి సంబంధించి పూర్తి సమాచారానికి 99592 26047, 73828 55793, 94941 07944 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



ఎంజీఎం : కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం అమలును రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి సుమిత్ర నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేట్ ఆస్పత్రులను సందర్శించి అనుమతుల రికార్డులను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు లింగ వివక్ష, ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు మంజుల, హెచ్‌ఈఓ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుకు ఉత్తర్వులు

ఖిలా వరంగల్: జిల్లా రవాణాశాఖ కార్యాలయ పరిధిలో అధునాతన స్మార్ట్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన హైవేకు ఆనుకొని ఉండేలా ఐదు ఎకరాల అనువైన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ సత్యశారదను గురువారం ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్‌బాబు కలిసి విజ్ఞప్తి చేశారు. అనువైన స్థలం లభిస్తే సెన్సార్ విధానంతో కూడిన అధునాతన స్మార్ట్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు.

ఎంజీఎంలో మరమ్మతుల పరిశీలన



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రితో పాటు కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని గురువారం విద్యుత్‌శాఖ అధికారులు సందర్శించారు. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించడానికి ఎంజీఎంలో ఆస్పత్రిలో ఉన్న ఆటో జనరేటర్ వర్కింగ్ కండిషన్లను పరిశీలించారు. సూపర్ ఆస్పత్రిలో మరమ్మతులో ఉన్న జనరేటర్‌ను వాడకంలోకి తేవాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్ గౌతమ్‌రెడ్డి, డీఈ మల్లికార్జున్, ఏడీ సురేశ్, ఏఈ రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

గంజాయి సిగరేట్!

అలవాటు పడుతున్న యువత



కాజీపేట: దర్గాకాజీపేట శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలో గురువారం సాయంత్రం ముగ్గురు యువకులు కూర్చుని సిగరేట్ పీల్చుతున్నారు. అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన రైల్వే పోలీసులు ఆ యువకులను గుర్తించి ఏం చేస్తున్నారంటూ మందలించారు. ఆ యువకులు తాగుతున్న సిగరేట్లను అక్కడే పడేసి పారిపోయారు. తీరా ఆ సిగరేట్లను పరిశీలించిన పోలీసులు ఆశ్చర్యపోయారు. గంజాయి సిగరేట్లు అని తెలుసుకుని అవాక్కయ్యారు. సిగరేట్ మాదిరే తయారు చేసుకుని పీల్చుతుండడం బట్టి చూస్తే నగరంలో ఈ గంజాయి పొడి లభిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి ఘటనలు వరంగల్, మడికొండ, కాజీపేట శివారులోని బహిరంగ ప్రదేశాలు, కళాశాలల మైదానాల్లో వెలుగుచూస్తున్నాయి. ఈగంజాయి సిగరేట్లను అరికట్టకపోతే విద్యార్థులు, యువత తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులు తీవ్రంగా పరిగణించి వరంగల్ నగర వ్యాప్తంగా తనిఖీలను చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నీటి కోసం కోటి తిప్పలు

శివనగర్‌లో దాహం.. దాహం.



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని పలు కాలనీల్లో ప్రజలు దాహం..దాహం..అంటున్నారు. శివనగర్ వాటర్ సంపుహౌస్ నుంచి అంతర్గత రహదారుల మీదుగా వెళ్లే తాగునీటి పైపులైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. వారం రోజులుగా తాగునీటి కోసం అరిగోస పడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివనగర్ పల్లవి ఆస్పత్రి నుంచి వాటర్ సంప్ హౌస్ మీదుగా మైసయ్యనగర్ మట్టికోట వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీనివల్ల అంతర్గత కాలనీలకు వెళ్లే తాగునీటి పైపులైన్లు ధ్వంసమయ్యాయి. మధ్యాహ్నం వేళల్లో దూర ప్రాంతానికి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాలంటే భానుడి ప్రతాపంతో ప్రజలు జంకుతున్నారు. నీటి సమస్యను స్థానికులు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా.. ఇంటికి రెండు బిందెలు కూడా దొరకడం లేదని మహిళలు చెబుతున్నారు. అధికారులు స్పందించి నీటి ఎద్దడి తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చెత్తకుప్పలుగా పాత రికార్డులు

డంపింగ్ యార్డును తలపిస్తున్న చిట్స్ కార్యాలయం



కాజీపేట అర్బన్ : పాతఫైళ్లు, వ్యర్థాలతో జిల్లా చిట్స్ కార్యాలయం డంపింగ్ యార్డును తలపిస్తోంది. కాజీపేట వంద ఫీట్ల రోడ్డులోని చిట్స్ జిల్లా కార్యాలయం, సహాయ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఉమ్మడి జిల్లాలోని వివిధ చిట్‌ఫండ్ కంపెనీలకు సంబంధించిన 12 ఏళ్ల టెంపరరీ రికార్డులు చెత్త కుప్పలుగా పడేశారు. ఇవి ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. ఈ రికార్డులను అధికారుల సమక్షంలో దగ్ధం చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో అంతా వీడియో తీయాల్సి ఉంటుంది. కానీ ఎవరూ చొరవ తీసుకోకపోవడంతో కార్యాలయ ఆవరణ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. కాగా, కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు పాత రికార్డులే కదా వాటిని ఎవరికి తెలియకుండా అమ్మి సొమ్ము చేసుకుందామనే యత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ అమ్మితే పలు కీలకవిషయాలు బయట వ్యక్తులకు తెలిసే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'వెల్‌నెస్'లో టాయిలెట్లకు తాళం

సీనియర్ సిటిజన్లకు అవస్థలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌లోని టాయిలెట్లకు తాళం వేసి ఉండడంతో గురువారం వైద్యచికిత్సకు వచ్చిన సీనియర్ సిటిజన్లు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డయాబెటిక్, బీపీ, గుండె సంబంధిత, ఇతర వ్యాధులతో బాధపడుతూ వెల్‌నెస్ సెంటర్‌కు ప్రతీ రోజూ సుమారు 300మంది వరకు వస్తుంటారు. వారికి కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య పరీక్షలు, మందుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నామని వాపోయారు. ఈక్రమంలో ఒంటికి, రెంటికి వెళ్లాలంటే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. టాయిలెట్లకు తాళం వేసి ఉన్న విషయాన్ని వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ సన్నీ దృష్టికి తీసుకెళ్లగా గురువారం మున్సిపల్ కార్పొరేషన్ నీరు సరఫరా కాకపోవడంతో సంపులో నీరు లేదని, అందుకే టాయిలెట్లకు తాళం వేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు.

'పొలంబాట'తో సత్ఫలితాలు

పరిష్కారమవుతున్న విద్యుత్ సమస్యలు

- క్షేత్రస్థాయికి వెళ్తున్న ఎన్పీడీసీఎల్ అధికారులు
- విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన
- హనుమకొండ జిల్లాలో 277, వరంగల్ జిల్లాలో 40 'పొలంబాట' కార్యక్రమాలు



హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హన్మకొండ: విద్యుత్ అధికారులు చేపట్టిన పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టింది. డీఈ, ఏడీఈ, ఏఈ, ఇతర అధికారులతోపాటు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్లు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి నేరుగా సమస్యలు తెలుసుకుంటున్నారు. రైతులు తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. ఈసందర్భంగా విద్యుత్ ప్రమాదాల పట్ల అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఆటోమేటిక్ స్టార్టర్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. వంగిన స్తంభాల, లూజ్ లైన్లు సరిచేయడం, మధ్య స్తంభాలు ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు పెంచడం వంటి అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. పొలాల్లో లూజ్ లైన్లు, ఎత్తు తక్కువగా విద్యుత్ లైన్లు ఉండడంతో వరి కోతల సమయంలో హార్వెస్టర్లకు తగిలి విద్యుదాఘాతానికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లూజ్ లైన్లు, కిందకు ఉన్న లైన్ల ఎత్తును పెంచుతున్నారు. ఎత్తు పెంచేందుకు 9.1 మీటర్ ఎత్తున్న విద్యుత్ స్తంభాలు నాటుతున్నారు.

హనుమకొండ జిల్లా (సర్కిల్)లో..

- ఇప్పటివరకు 277 పొలంబాట కార్యక్రమాలు చేపట్టారు. 238 వంగిన స్తంభాలు, 703 లూజ్ లైన్లు సరి చేశారు.
- 1,179 మధ్యస్తంభాలు ఏర్పాటు చేశారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా ఎర్తింగ్ సరిగ్గా ఉండేలా ఏర్పాట్లు చేశారు.
- తక్కువ ఎత్తులో ఉన్న 128 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచారు.
- ప్రమాదకరంగా ఉన్న డబుల్ ఫీడింగ్, లో లెవెల్ లైన్ క్రాసింగ్‌లను తనిఖీ చేసి సరిచేస్తున్నారు.
- ఇప్పటివరకు 144 డబుల్ ఫీడింగ్, లో లెవెల్ లైన్ క్రాసింగ్‌లను మార్చారు.
- లైన్లు తక్కువ ఎత్తులో ఉన్న వాటి స్థానాల్లో 9.1 మీటర్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.

వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో..

- ఇప్పటివరకు 40 పొలంబాట కార్యక్రమాలు చేపట్టారు.
- ఇందులో 236 వంగిన స్తంభాలు, 739 లూజ్‌లైన్లు సరిచేశారు.
- 659 మధ్యస్తంభాలు ఏర్పాటు చేశారు.
- తక్కువ ఎత్తులో ఉన్న 98 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచారు.
- ఇప్పటివరకు 76 డబుల్ ఫీడింగ్, 134 లో లెవెల్‌లైన్ క్రాసింగ్‌లను మార్చారు.
- హార్వెస్టర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలతోపాటు తక్కువ ఎత్తులో లైన్ల స్థానాల్లో 9.1 మీటర్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించేందుకే 'పొలంబాట'



రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు పొలంబాట కార్యక్రమం చేపట్టాం. రైతుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నాం. విద్యుత్ ప్రమాదాలపై చైతన్యవంతులను చేస్తున్నాం. రైతులు ఏమైనా సమస్యలుంటే టోల్ ఫ్రీనంబర్ 1912కు ఫోన్ చేయాలి.

– పి.మధుసూదన్‌రావు, ఎస్‌ఈ, హనుమకొండ సర్కిల్

రైతుల ముంగిట్లోకి విద్యుత్ అధికారులు...



పొలంబాట ద్వారా రైతుల ముంగిటికి విద్యుత్ అధికారులు వెళ్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. రైతులకు సేవలు అందించేందుకు అధికారులందరం కంకణబద్ధులై ఉన్నాం. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి.

– కె.గౌతంరెడ్డి, ఎస్‌ఈ, వరంగల్ సర్కిల్

అస్తిత్వానికి ఆయువు పట్టు ఆంగ్ల భాష

- కెన్యా ప్రొఫెసర్ కుప్పు రామ్
- కేడీసీలో అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కెన్యా ప్రొఫెసర్ కుప్పు రామ్

విద్యారణ్యపురి: ఆంగ్ల భాష మన అస్తిత్వానికి ఆయువు పట్టువంటిదని విభిన్న భాషా సంస్కృతులను గౌరవించేదిగా ఇంగ్లిష్ విలసిల్లాలని కెన్యా మసింది ములురో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ కుప్పు రామ్ అన్నారు. గురువారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో 'ట్రాన్స్‌ఫర్మేషన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఇన్ మల్టీ డిసిప్లినరీ కాంటెక్స్ ఇన్‌ది ఎరా' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కెన్యా యూనివర్సిటీ ప్రొఫెసర్ కీలకోపన్యాసం చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ అధ్యాపకులు మెళకువలతో బోధించాలన్నారు. సదస్సులో 150 పరిశోధన పత్రాలు వచ్చాయి. ఓ జర్నల్‌ను ఆవిష్కరించారు. కేడీసీ ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో హైదరాబాద్ ఇఫ్లూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఈ.వేదశరణ్, కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాంభాస్కర్‌రాజు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ కె.సోమిరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, యూజీసీ గుర్తింపు పొందిన జర్నల్ ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ ప్రశాంత్ మోతె పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసులు ఉన్నారనే ధైర్యం కలిగించాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం : పోలీసులు ఉన్నారు.. మనకు సహాయం చేస్తారనే ధైర్యాన్ని ప్రజలకు ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో ఇంటర్ సెప్టర్, పెట్రోకార్, హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో సీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన వెంటనే ఫిర్యాదుదారు వద్దకు చేరుకొని సమస్యను తెలుసుకొని, అక్కడే పరిష్కరించడం లేదా పోలీస్ స్టేషన్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. రాత్రి సమయంలో ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకానికి ఎక్కువగా పెట్రోలింగ్ విధులు నిర్వహించాలని, ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ తెలంగాణ పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 480 మంది గైర్హాజరు



హనుమకొండ: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో 55 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో సందడిగా మారాయి. సెకండియర్ జనరల్ విభాగంలో 18,100 మంది విద్యార్థులకుగాను 17,659 మంది విద్యార్థులు హాజరు కాగా.. అందులో 441 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 869 మందికి గాను 830 మంది హాజరు కాగా.. వారిలో 39 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ. గోపాల్ తెలిపారు. మొత్తం 480 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా.. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని, రెజోనెన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి తనిఖీ చేశారు.

వరంగల్ జిల్లాలో..

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లా వ్యాప్తంగా గురువారం 26 కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. మొదటి రోజు 4,838 మంది జనరల్ విద్యార్థులకు 4,718 మంది హాజరు కాగా.. 120 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 668 మంది ఒకేషనల్ విద్యార్థులకు 635 మంది హాజరుకాగా.. 33 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

నృత్యం చేస్తున్న మహిళా ఉద్యోగులు



ఉద్యోగుల ఆటా... పాట

హన్మకొండ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడా సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం కలెక్టరేట్‌లోని టీజీఓ కార్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం రాష్ట్ర నాయకులు ఎన్నమనేని జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమానికి వరంగల్ జిల్లా ప్రధాన జడ్జి నిర్మలా గీతాంబ, హనుమకొండ వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ పాల్గొంటారని పేర్కొన్నారు.

పంపులను వినియోగంలోకి తేవాలి..

మేయర్ గుండు సుధారాణి



కేయూసీ ఫిల్టర్‌బెడ్‌లో పంపులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్: మోటారు పంపులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకతీయ ఫిల్టర్ బెడ్ (కేయూసీ)ని మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిల్టర్ బెడ్‌లో ఇటీవల దెబ్బతిన్న నీటి సరఫరా మోటారు పంపులను పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వేసవి వచ్చినందున నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఫిల్టర్‌బెడ్‌లో 3 రోజులుగా పని చేయకుండా ఉన్న మోటారును పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి ముందస్తుగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఫిల్టర్‌బెడ్‌లో పురాతన నీటి పంపింగ్ స్టేషన్‌ను మేయర్ పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్ ఆవరణలోని రాణి రుద్రమ విగ్రహం ఉన్న ప్రాంతంలో గులక రాళ్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది హార్టికల్చర్ వారి సహకారంతో ఆ ప్రాంతంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు మహేందర్, మాధవీలత, సంతోశ్‌బాబు, డీఈఈ రాజ్‌కుమార్, ఏఈలు హరికుమార్, సరిత పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత : కేయూ వీసీ



వరంగల్ కలెక్టర్ సత్యశారదను సన్మానిస్తున్న వర్సిటీ అధికారులు

కేయూ క్యాంపస్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. వివిధ పదవుల నిర్వహణలోనూ సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయంలో పరిపాలనా పదవుల్లోనూ మహిళలకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. మహిళలు మల్టీటాస్కర్స్ అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యశారదను సన్మానించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షాలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ బి.రమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.స్వప్న, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

11న వరంగల్ జిల్లాస్థాయి యువజనోత్సవాలు

వరంగల్: బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 11న నిర్వహించనున్న వరంగల్ జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక జానపద నృత్యం (గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్, వ్యక్తిగత) అంశాల్లో పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచ ప్రాణ్ అంశంపై పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. గ్రూప్, ఫోక్‌డ్యాన్స్, ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో పంచ్ ప్రాణ్ అంశం వర్తించదని వివరించారు. ఉత్సాహవంతులైన ఫొటోగ్రాఫర్లు తమ సెల్‌ఫోన్లు, తెచ్చుకున్న కెమెరాలతో పోటీ ప్రదేశంలో ఇచ్చిన థీమ్స్‌ను ఫొటోలు తీసి చూపిస్తారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతితోపాటు ప్రశంసపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. జిల్లాలోని యువజన సంఘాలు, కళాశాల విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 76758 24707/95733 93831 నంబర్లలో సంప్రదించాలని అన్వేశ్ సూచించారు.

హోలీ పండుగకు ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 9వ తేదీనుంచి చర్లపల్లి–దానాపూర్, చర్లపల్లి–ముజఫర్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను కాజీపేట జంక్షన్ మీదుగా నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

రైళ్ల వివరాలు..

ఈ నెల 9, 19వ తేదీన చర్లపల్లి–దానాపూర్ (07709) వెళ్లే ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 17:10 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 11, 21వ తేదీల్లో దానాపూర్–చర్లపల్లి (07710) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు 21:45 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 10, 15, 20వ తేదీల్లో చర్లపల్లి–ముజఫర్‌పూర్ (07711) వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేటకు 17:10 గంటలకు చేరుతుంది. ఈ నెల 12, 17, 22వ తేదీల్లో ముజఫర్‌పూర్–చర్లపల్లి (07712) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు 16:00 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ రైళ్లకు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు శ్రీధర్ పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అజాంఘర్–చర్లపల్లి మధ్య దక్షిణ మధ్య రైల్వే వన్‌వే స్పెషల్ ట్రైన్స్ నడిపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటినుంచి గార్లలో మణుగూరుకు హాల్టింగ్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే సికింద్రాబాద్–మణుగూర్ (12745) ఎక్స్‌ప్రెస్, మణుగూర్–సికింద్రాబాద్ (12746) వెళ్లే మణుగూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నేడు (శుక్రవారం) నుంచి 6 నెలల పాటు ప్రయోగాత్మకమైన హాల్టింగ్‌ను కల్పించినట్లు ఎ.శ్రీధర్ వివరించారు.

నేటినుంచి కేవీలో అడ్మిషన్లు

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతిలో ప్రవేశానికి శుక్రవారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ గురువారం ప్రకటన విడుదల చేసింది. మార్చి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో kvso nineadmirrion.kvr.gov.in లేదా కేవీ సంఘటన్.ఎన్‌ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

రాములోరికి 'గోటి తలంబ్రాలు'

- చేతిగోళ్లతో ఒక్కో వరి గింజను ఒలిచి..
- నవమి నాటికి అక్షింతల బియ్యం సిద్ధం


వరి ధాన్యాన్ని గోటితో ఒలుస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్ : రాములోరి కల్యాణం.. కమనీయం.. రమణీయం..చూసిన కనులదే భాగ్యం.. భద్రాద్రిలో జరిగే వేడుకను తిలకించి..తరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వీరిలో ఓరుగల్లు మహిళలు పరిణయ వేడుకకు తలంబ్రాలను సిద్ధం చేయడానికి వరిగింజలను గోటితో ఒలిచి తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు.

గోటి తలంబ్రాలు..

శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలకు ప్రత్యేకత ఉంది. వడ్ల గింజలను రోలులో దంచడంగాని లేక మిల్లులో మరపట్టించినవి కావు.. మహిళలు చేతిగోళ్లతో ఒక్కొక్క ధాన్యపు గింజను వలచిన బియ్యం. వీటినే గోటి తలంబ్రాలు అంటారు.

ఎంతో పవిత్రంగా..

శ్రీరామనామ స్మరణతో ఎంతో పవిత్రంగా గోటితో తలంబ్రాలు ఒలుస్తారు. ఈ తలంబ్రాల కోసం విత్తనాల వడ్లను ప్రత్యేకంగా సాగు చేస్తారు. శ్రీరాముడి కల్యాణ తంతు జరుగుతున్నప్పుడు తలంబ్రాలతో పాటు సాగుచేయడానికి కావలసిన వడ్లను కూడా స్వామివారి పాదాల వద్ద పెడతారు. ఆ వడ్లనే తిరిగి సాగుచేయడానికి వాడుతారు. వీటిని కొందరు భక్తిభావంతో తమ పొలంలో కొంత భూమిని కేటాయించి సాగు చేస్తుంటారు. ప్రత్యేక ముడుపులుగా చేసి మందులు, ఎరువులు వేయకుండా, కాళ్లతో తొక్కకుండా, పవిత్రంగా పండిస్తున్నారు. వంటపొలాల్లో కంకులను కూడా కత్తులతో కాకుండా శ్రీరామనామం జపిస్తూ చేతిలో వలుస్తారు.

ధన్యులమయ్యాం..



రాముల వారి కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు.. ఈ అక్షింతలను కోటి తలంబ్రాలుగా చెబుతారు. గోటి తలంబ్రాల కార్యక్రమంలో భాగస్తులైనందుకు ధన్యులమయ్యాం. - పంతుల సుధామాధురి

కొరియర్ ద్వారా..

వరి ధాన్యాన్ని తలంబ్రాలుగా ఒలిచేందుకు భద్రాచలం నుంచి శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధులు కొరియర్ ద్వారా పంపగా వరంగల్ బ్యాంక్‌కాలనీలోని ఏలిషాల సుజాత అందుకున్నారు. ఈ ధాన్యాన్ని కాలనీ మహిళలు నిత్యం నిష్ఠతో ఉండి భక్తిశ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ, శ్రీరామ స్మరణ చేస్తూ గోటితో ఒలిచి.. తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. ఈ నెల 8న శనివారం ఒలిచిన తలంబ్రాలను కొరియర్ ద్వారా భద్రాచలం రాములవారికి పంపిస్తారు. సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తున్నామని మహిళలు చెబుతున్నారు.

మా ఇంట్లోనే తలంబ్రాలు చేస్తాం..



ఫిబ్రవరి 15న భద్రాచలం నుంచి 2 కిలోల వడ్లను అందుకుని వలిచే కార్యక్రమాన్ని మా ఇంట్లో ప్రారంభించాము. ఈ నెల 8న శనివారం ఒలిచిన బియ్యాన్ని భద్రాచలానికి పంపిస్తాం. శ్రీసీతారాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించుకుని నియమ నిష్ఠలతో కాలనీ మహిళలతో కలిసి ఒలిచే కార్యక్రమం మా ఇంట్లో తలంబ్రాలుగా తయారు చేయడం సంతోషంగా ఉంది.
- ఏలిషాల సుజాత, బ్యాంక్‌కాలనీ, వరంగల్

ఆనందంగా ఉంది



శ్రీరామ నామాన్ని స్మరిస్తూ భక్తిభావంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. భగవంతుని సేవ చేయడం వల్ల మాకు మంచి జరుగుతుందనే భావన. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తోటి మహిళలతో స్నేహబంధాలు పెరుగుతాయి.
- లావణ్య, బ్యాంక్‌కాలనీ, వరంగల్

ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా

- తరచూగా ఆకస్మిక పరిశీలన, తనిఖీలు


వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్ : వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. అధికారుల పనితీరు, వాహనదారులకు అందించే సేవలపై రహస్యంగా పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ రవాణాశాఖ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీరో కౌంటర్ల వద్ద అందజేస్తున్న సేవలు, వాహన ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ విధానం, ఆన్‌లైన్ డ్రైవింగ్ పరీక్షలను స్వయంగా పరిశీలించారు. అనంతరం జీరో కౌంటర్లలో సోదాలు చేసిన అధికారులు ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్ బాబును కలిసి సేవలకు సంబంధించిన కొన్ని పత్రాలను అడిగి తీసుకున్నారు. దళారుల కార్యాలయాల్లో ఏమైనా వాహనదారులకు చెందిన ఫైల్స్ ఉన్నాయా.. అనే దానిపై ఆరా తీశారు. అధికారుల పనితీరు, రవాణాశాఖ అందజేస్తున్న సేవలపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పెళ్లి వద్దని ఆత్మహత్యాయత్నం

- మానుకోట ఎస్సై సమాచారంతో కాపాడిన కాజీపేట జీఆర్పీ పోలీసులు
- తండ్రికి విద్యార్థిని అప్పగింత


విద్యార్థిని తండ్రికి అప్పగిస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ కమలాకర్

కాజీపేట రూరల్ : పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఓ విద్యార్థిని కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకొని ఆమె తండ్రికి అప్పగించిన సంఘటన కాజీపేటలో జరిగింది. జీఆర్పీ కానిస్టేబుల్ ఆర్.కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నందిని హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతోంది. ఇంటికి వచ్చిన నందినికి పెళ్లి చేస్తానని చెప్పడంతో తల్లి కూతుళ్ల మధ్య గొడవ జరిగింది. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని నందిని బుధవారం ఇంటి నుంచి వచ్చి కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అదే రోజు రాత్రి నందిని కాజీపేటలో ప్రయాణికుడి సెల్‌ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. అప్రమత్తమై తండ్రి మహబూబాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సమాచారంతో కాజీపేట జీఆర్పీ పోలీసులు రైల్వే యార్డు ఆర్‌ఆర్‌ఐ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న నందినిని గుర్తించి అదుపులోకి తీసుకొని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. తండ్రిని పిలిపించి జీఆర్పీ అధికారుల ఆదేశాలనుసారం నందినిని తండ్రి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానా

మడికొండ : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం .. కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన మీరాల రాజు 2017, జూలై 22న సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. అప్పటి ఎస్సై మధుప్రసాద్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణలో భాగంగా గురువారం కానిస్టేబుల్ వి.రాజేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాడు. ప్రాసిక్యూషన్ తరపున ఎస్.దుర్గబాయ్ వాదించగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో హనుమకొండ మొదటి అదనపు న్యాయమూర్తి చింతాడ శ్రావణ స్వాతి నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.6,000ల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

22న పేరిణి నృత్య విశారద పరీక్షలు

హన్మకొండ కల్చరల్: ఈనెల 22న పేరిణి నృత్య విశారద పరీక్షలు 2024–25 నిర్వహించనున్నట్లు నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ నిర్వాహకులు ప్రముఖ పేరిణి నాట్య ఆచార్యులు గజ్జెల రంజిత్ కుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం నృత్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్‌ను నాగార్జున స్కూల్ అధినేత ఆడెపు వెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. వరంగల్ పేరిణి నృత్యాలయంలో 22న శనివారం థియరీ, 23న ఆదివారం ప్రాయోగికం పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా అకాడమీలో 2023–24 సంవత్సరం పేరిణి నాట్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన తొమ్మిది మంది యువ నాట్య ఆచార్యులను ప్రోత్సహించేందుకు రూ.1.50 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ నర్సింగరావు, సీహెచ్ లత, చాతరాజు నవ్యజ, పల్పాటి శ్రీజ, బండారు వైష్ణవి, తేజస్విని, మర్కాల లోహిత్, గురుదేవ్, సంతోశ్, రేగుల చందు, సాయికపిల్, తేజ పాల్గొన్నారు.

తక్కువ ధరకే వ్యాక్సిన్లు తయారు చేయాలి

కేయూ క్యాంపస్: వాక్సిన్ల తయారీలో ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్ ఎదిగిందని.. తక్కువ ధరకే వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో జువాలజీ విభాగంలో గత రెండ్రోజులుగా 'యూసెస్ రీకాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీస్ ఇన్‌హెల్త్ కేర్' అంశంపై నిర్వహిస్తున్న సదస్సు గురువారం సాయంత్రం ముగిసింది.

పునరుద్ధరణ పనులు పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


మ్యూజికల్ గార్డెన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వాకడే

వరంగల్ : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని 'కుడా' వైస్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. కొనసాగుతున్న ఫౌంటెన్ పనుల్ని పరిశీలించి సమర్థ నిర్వహణకు సూచనలిచ్చారు. భద్రకాళి చెరువులో తీస్తున్న పూడికతీతను పరిశీలించారు. మూడు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీతే లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 50 వేల క్యూబిక్ మీటర్లు డీసిల్టేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఖిలా వరంగల్‌లోని ఏకశిల పార్కును కమిషనర్ సందర్శించారు. నగర ప్రజల సౌకర్యార్థం పార్కును మరింత అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించేందుకు టాయిలెట్లు, కిచెన్, డైనింగ్ హాల్, ఓపెన్ థియేటర్, కాటేజీలతో పాటు చెరువు చుట్టూ బండ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట 'కుడా' పీడీ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు

విద్యారణ్యపురి : హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువ ఉత్సవ్–25 జిల్లా స్థాయి యువజనోత్సవం,సాంస్కృతిక ప్రతిభాపాటవ పోటీలు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.. యువతలో ఉన్నత సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులకు ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, జానపద నృత్యం, సైన్స్ ఎగ్జిబిషన్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.రాజన్న, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, నెహ్రూ యువ కేంద్ర సూపరింటెండెంట్ బి.దేవీలాల్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు. అధ్యాపకులు సురేశ్, ఎం.అరుణ, ఎన్ఎస్ఎస్ అధికారులు కవిత, రామా రత్నమాల, వి.మమత తదితరులు పాల్గొన్నారు.

భళా.. ఇత్తడి హస్తకళ

- రాష్ట్రపతి భవన్‌లో ఈ కళకు ప్రత్యేక గుర్తింపు
- వరంగల్‌కు దక్కిన గౌరవంపై ప్రశంసలు
- ప్రత్యేక ఆకృతులతో ఆకట్టుకుంటున్న స్టాల్


న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన రంగశాయిపేట హస్తకళ స్టాల్

సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లా రంగశాయిపేట ఇత్తడి హస్తకళకు దేశ రాజధానిలో ప్రత్యేక గుర్తింపు దక్కుతోంది. కాకతీయుల కాలం నాటి వెండి నగిషీలు తయారుచేసే పెంబర్తి హస్తకళకు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉంటే.. వాటి సరసన రంగశాయిపేట ఇత్తడి హస్తకళ పోటీపడుతోంది. అమృత్ మహోత్సవ్‌లో భాగంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నుంచి జరుగుతున్న దక్షిణ భారత ఎగ్జిబిషన్‌లో రంగశాయిపేట ఇత్తడి హస్తకళ స్టాల్‌కు చోటు లభించింది. ఓ వైపు సాంస్కృతిక ప్రతిరూపాలను తెలిపే డిజైన్లు, మరోవైపు నేటి కాలానికి తగ్గట్టుగా మోడ్రన్ డిజైన్ విత్ ఎంబోజింగ్ వర్క్ ద్వారా విభిన్న హస్తకళ డిజైన్లు చేస్తుండడంతో వీటికి ప్రత్యేక గుర్తింపు లభించింది. నాబార్డు, డీసీహెచ్ మద్దతుతో వందలాది కుటుంబాలకు ఈ హస్తకళ నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బంధం ముందుకెళ్తోంది. 'రాగి లేదా ఇత్తడి లోహన్ని సన్నని షీట్లుగా కొట్టి, చక్కటి తీగగా కట్ చేస్తాం. చెక్క ఉపరితలంపై గుర్తించబడిన డిజైన్‌ను సుత్తి, ఉలి సాయంతో కోస్తాం. ఇత్తడి లేదా రాగి తీగను డిజైన్‌తో చెక్కబడిన భాగంలోకి సుత్తితో గుచ్చుతాం. ఆ తర్వాత రంపంతో కత్తిరించి డిజైన్‌లో కావల్సిన ప్రదేశాలలో జిగురుతో బిగిస్తాం. అత్యాధునిక పద్ధతులతో వివిధ డిజైన్లతో వస్తువులను తయారు చేస్తున్నాం. ఇంటీరియర్ వర్క్‌లో ఫ్లవర్ వాజెస్, వాల్ ప్యానెల్స్, డోర్ ప్యానెల్స్ చేస్తున్నాం .అలాగే దేవాలయం, దేవుళ్ల ఫొటోలతో కూడా ఎంబోజింగ్ వర్క్‌తో అది కూడా చేతి ద్వారా చేయడంతో ఆయా బొమ్మల ఆకారం స్పష్టంగా కనబడుతుంద'ని రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బృంద సభ్యుడు ప్రణయ్ గురువారం 'సాక్షి'కి వివరించారు. అలాగే వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. 'రంగశాయిపేట ఇత్తడి హస్తకళలకు రాష్ట్రపతి నిలయంలో జరిగిన అమృత్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ లో చోటు దక్కడం జిల్లాకు దక్కిన గుర్తింపు. మరోసారి చేతికళలకు నిలయమని దేశమంతటా తెలిసింది. ఈ హస్త కళాకారులు భవిష్యత్‌లో ఇత్తడితో విభిన్న డిజైన్లు చేసి ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా పనిచేయాల'ని ఆకాంక్షించారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

- 'అకుట్' నూతన అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి


కేయూలో వీసీ, రిజిస్ట్రార్‌ను కలిసిన 'అకుట్' బాధ్యులు, నూతన కార్యవర్గం

కేయూ క్యాంపస్: అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన 'అకుట్' అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో అకుట్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010లో నియమకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల పదోన్నతులు లీగల్ సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారిస్తామన్నారు. అకుట్ మాజీ జనరల్ సెక్రటరీ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. తమ హయాంలో పెండింగ్‌లో ఉన్న అధ్యాపకులు అనేక సమస్యలను వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని పలు అంశాలను ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. అధ్యాపకుల పదోన్నతులకు సంబంధించి పూర్తి ఎరియర్స్‌ను వచ్చేలా అకుట్ కృషి చేసిందన్నారు. ఆచార్యుల ఉద్యోగ విరమణ వయస్సును పెంపు కోసం పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఇటీవలే ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును పెంచిందన్నారు. అకుట్ నూతన జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ నూతన కార్యవర్గ బాధ్యులు పాల్గొన్నారు. తొలుత అకుట్ నూతన కార్యవర్గం వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డిని, రిజిస్ట్రార్ వి.రామచంద్రంను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలు అందజేశారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

భూమానార్య శతక పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగంలో మదగాని విజయలక్ష్మి రచించిన తెలంగాణ మాండలిక భాషలో భూమనార్యశతకం పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మాండలికం ప్రధానంగా పల్లెలో వాడుక భాష సహజమైన వ్యవహారిక భాష ఈ భూమనార్యశతకం అని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కేయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ..భూమనార్య మాట బుద్ధి మాట మకుటంతో మదగాని విజయలక్ష్మి రాసిన భూనార్యశతకం ఒక విశేషమైనదన్నారు. ఈ సమావేశంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ చిర్రరాజు, గిరిజామనోహర్, సంగాల కోమల, స్వామి నాయక్, బేరి దేవేందర్, అభిరామ్, వేణు, ఎర్ర రాజు, ప్రసాద్, నిత్యానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలక మండలి సమావేశం వాయిదా!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం ఈనెల 7న హైదరాబాద్‌లో జరగాల్సి ఉండగా.. వాయిదా పడినట్లు సమాచారం. పాలక మండలి సమావేశంలో చర్చించాల్సిన అంశాలు ఎజెండాను కూడా కాకతీయ యూనివర్సిటీ అధికారులు రూపొందించారు. ఈమేరకు పాలకమండలి సభ్యులకు ఆ సమాచారం కూడా అందించారు. అయితే గురువారం రాత్రి పాలకమండలి సమావేశం వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత సమాచారం అందిస్తామని వర్సిటీ అధికారులు పాలక మండలి సభ్యులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

గంజాయి స్వాధీనం

నడికూడ : మండలంలోని చర్లపల్లి వద్ద నిషేధిత గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండ్ వద్ద స్కూటీపై ఇద్దరు అనుమానాస్పందగా కనిపించారు. వీరిని ఆపి తనిఖీ చేయగా 2.840 కేజీల గంజాయి రవాణా చేస్తు పట్టుబడ్డారు. అదుపులో తీసుకొని విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ నాగులూర్‌కు చెందిన పప్పల్ బాలయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచకు చెందిన ముదిగొండ ప్రశాంత్ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,42లక్షల వరకు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకొని, పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


శరవేగంగా భూ సర్వే

- సర్వేకు రైతుల సుముఖత
- ఎయిర్ పోర్ట్ రన్‌వేకు 253 ఎకరాలు సేకరణ


సర్వే చేస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది

ఖిలా వరంగల్ : మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. భూ సర్వేకు రైతుల సైతం సుముఖంగా ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్ల నిధుల విడుదల చేసింది. కలెక్టర్ ఆదేశాలతో గురువారం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నక్కలపల్లి, గాడిపల్లి గ్రామ శివారులో శరవేగంగా భూ సేకరణకు సర్వే చేపట్టారు. రైతుల సహకారంతో తొలిరోజు 170 ఎకరాల భూ సర్వే చేసి హద్దులు గుర్తించారు. అనంతరం భూ నిర్వాసితుల నుంచి వ్యక్తిగత వివరాలను సేకరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సహకారంతో తొలిరోజు నక్కలపల్లి–47, గాడిపల్లి శివారు పరిధిలో 123, మొత్తం 170 ఎకరాలు సర్వే చేశామని తెలిపారు. మిగిలిన 83 ఎకరాల భూమి మరో మూడ్రోజుల్లో పూర్తి చేసి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం సర్వేకు సహకరించిన రైతులకు తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వేలో ఆర్ఐ ఆనంద్‌కుమార్, సర్వేయర్ రజిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏజే మిల్లు కార్మిక భవన స్థలం సర్వే


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలో ఉన్న ఏజే మిల్లు కార్మిక భవనం మ్యూటేషన్, రిజిస్ట్రేషన్‌తో పాటు నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని ఏజే మిల్లు భూముల పరిరక్షణ సమితి జేఏసీ, పలు సంఘాల నాయకులు ఆందోళనలు చేశారు. పలుమార్లు కలెక్టర్ సత్యశారద, కమిషనర్ వాకడేకు వినతిపత్రాలు సమర్పించి ల్యాండ్ సర్వే విభాగంతో సర్వే చేయించాలని కోరారు. ఈనేపథ్యంలో గురువారం ల్యాండ్ సర్వే శాఖ ఏడీ దేవరాజ్, డీఏ భుజంగరావు, సర్వేయర్ సందీప్ కార్మిక భవనం స్థలాన్ని రీ సర్వే చేశారు. జేఏసీ నాయకులు స్థలం వద్దకు వచ్చి ఏడీతో కాకుండా డీడీ నేతృత్వంలో సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతోనే వచ్చామని అధికారులు తెలపడంతో నాయకులు సర్వేలో పాల్గొన్నారు. నాయకులు గంగుల దయాకర్, ఆకెన వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల లక్ష్మణ్, డాక్టర్ కొనతం కృష్ణ, ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ, జన్ను రమేశ్, కోమాకుల నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.